
# మారిన మనసు

- గొట్టుముక్కల శ్రీలలిత





ఉగాది పోటీలో ఎంపికైన కథ

వాతావరణం ముసురుపట్టి ఉంది. తుపాను వచ్చే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాజేందర్ అంతరంగం కూడా అలాగే ఉంది. మనసంతా ఏదో తెలియని దిగులు ఆవరించి ఉంది.

ఏదో కసి... ఏ పనీ చేయాలని లేదు. తండ్రి మనస్తత్వం అతనికి అంతు చిక్కడం లేదు. ఈ పరిస్థితి గత పదేళ్ళ నుంచీ ఉన్నదే.

విశాఖ సాగర తీరంలో ఇసుకలో కూర్చున్న రాజేందర్ ఏదో ఆలోచిస్తూనే వున్నాడు. ఎంతకీ ఆ ఆలోచన తెగడం లేదు.

తనకి ఆకలిగా లేకపోయినా తానెంత బిజీగా ఉన్నా కొసరి తినిపించే తండ్రి కొన్ని విషయాల్లో ఎందుకలా మొండిగా ఉంటారో రాజేందర్‌కి అర్థం కావడంలేదు. తండ్రి చూపించే ప్రేమ అతన్ని ఒక్కోసారి ఎంతో ఆనందపరిచేది.

తన ఫ్రెండ్స్ అంతా తమ తండ్రి తమతో సరిగా ఉండడం లేదని, ఏమడిగినా తర్వాత కొంటానని చెబుతున్నారని చెప్పినప్పుడు రాజేందర్ ఎంతో గర్వంగా ఫీలయ్యేవాడు.

ఫ్రెండ్స్‌తో కలిసి ఎక్కడికైనా వెళతానంటే వద్దని ఎప్పుడూ చెప్పని తండ్రి మనస్తత్వం అతని మదిలో మెదులుతూనే ఉంది. నిరంతరం తన అభివృద్ధి గురించే ఆలోచించే తండ్రి తనతో దానధర్మాల విషయంలో ఎందుకంత పట్టుదలతో ఉంటారో అతనికి అంతుచిక్కడం లేదు.

ప్రాణ సమానంగా తనని ప్రేమించే తండ్రితో గొడవ పడడం తనకి ఇష్టం లేకపోయినా ఎందుకో తెలియదు గానీ వయసు ప్రభావంవల్ల మొండి పట్టుదల ఎక్కువవుతోంది.

అందుకే గత కొన్నాళ్ళుగా తనను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే తండ్రితో మాట్లాడడం మానేశాడు. ఎప్పుడూ ఆయనతో కులాసాగా కబుర్లు చెప్పే రాజేందర్‌కి తండ్రి చేస్తున్న దానధర్మాలు నచ్చడం లేదు.

కోట్ల రూపాయల ఆస్తికి ఏకైక వారసుడైన రాజేందర్‌కి ఆ వితరణ కార్యక్రమాల గురించి కొంచెమైనా చెప్పకపోవడమే ఈ పరిస్థితికి కారణం.

ఇంజనీరింగ్ చదువుతున్న తనకూ కొన్ని అభిరుచులూ అవసరాలూ ఉంటాయని ఆయనకి తెలియడం లేదు. లక్షలాది రూపాయలు డొనేషన్లుగా కడుతున్నాడు గానీ తనకు కనీసం సొంత ఖర్చులంటూ కొన్ని వుంటాయని గ్రహించడం లేదు. తన అవసరాల నిమిత్తం డబ్బు అడిగితే ఇవ్వడం లేదు. ఆ విషయంలోనే తామిద్దరికీ తరచుగా గొడవ జరుగుతోంది. ఆరోజు జరిగిన సంభాషణ ఇప్పటికీ మదిలో మెదులుతూనే వుంది. కడలి అలల్లా అతడిలో ఉక్రోషం ఎగసి పడుతోంది.

* * *

"నానీ! నా మాట వినమ్మా! నీకెంత కావాలో అడిగి తీసుకో. అంతేగానీ నేను చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి మాత్రం నువ్వు ప్రశ్నించకు. వాటివల్ల మన ఆస్తేం తరిగిపోదు..." అంటూ తనకి నచ్చజెబుతున్న తండ్రి రామచంద్రరావు మాటలు అతనికి ఎక్కడం లేదు.

"ఏంటి నాన్నా! నేను అడిగిన డబ్బులు ఇవ్వకుండా ఈ కథంతా చెబుతావు. ఆ అనాథలకు నువ్వంత సాయం చేయాలా? ఎప్పటినుంచో నువ్వు చేస్తున్నావు కదా. నాకన్నా నీకు ఆ అనాథలే ఎక్కువ. నేను నీ కన్నడాకుకునేనా?" అంటూ తండ్రి మీద నిప్పులు చెరిగాడు.

తన కొడుకు ఆవేశం గురించి తెలిసిన తండ్రి ఏమీ అనలేకపోయాడు. తానిప్పుడు ఏం అన్నా ఇంట్లో గొడవ జరుగుతుంది తప్ప ప్రయోజనం లేదు. రెండు చేతులు కలిస్తే చప్పట్లు వచ్చినట్టు సాధారణంగా ఎవరితోనైనా గొడవ జరిగితే అవతల వ్యక్తి మాట పెంచితే గొడవ పెరిగిపోతుంది. అనుభవజ్ఞుడు, కంపెనీలో ఎన్నో వివాదాల్ని పరిష్కరించిన రామచంద్రరావుకి తెలుసుకాబట్టి కొడుకుతో ఎలాంటి గొడవ పడకుండా ఇంట్లోకి, తర్వాత త్వరగా తయారై కంపెనీకి వెళ్లిపోయాడు. ఈ విషయంలో అతనికి నచ్చచెప్పే బాధ్యత తల్లి ఉంటే చూసుకునేది. కానీ ఆమె లేని లోటు స్పష్టంగా తెలుస్తోంది.

భర్తకి అనారోగ్యం వస్తే భార్య ఆయనకి సేవలుచేసి ఆరోగ్యం కుదుటపరుస్తుంది. అంతేకాదు ఆమె త్వరగానే కోలుకుంటుంది. అదే భార్యకి అనారోగ్యం వస్తే మాత్రం భర్త బాధ్యత తీసుకోవడమే కాదు, ఆమెతోపాటూ అతనూ అనారోగ్యం పాలవుతాడట. అంతేకాదు భార్య చనిపోయిన కొన్నాళ్లకే కొంతమంది ఆమె వియోగాన్ని భరించలేక కృంగి కృశించిపోతారట. ఇదెంతో నిజం అనిపించింది ఆయనకి.

* * *

రోజూలాగే సాగర తీరంలో ఇసుకలో కూర్చుని అలల వంక చూస్తూ ఆలోచిస్తున్న రాజేందర్ సెల్‌ఫోన్ మోగింది.

"సార్!... నేను కారు డ్రైవర్ చక్రపాణిని. వెంటనే మీరు బయలుదేరి రండి. నాన్నగారికి హార్ట్‌ఎటాక్ వచ్చింది. ఆస్పత్రిలో జాయిన్ చేశాం. మీకోసమే కలవరిస్తున్నారు..." అంటూ ఏదో చెప్పుకుపోతున్నాడు డ్రైవర్.

కానీ ఆలోచనల్లో ఉన్న రాజేందర్‌కి అవతలి మాటలు సరిగ్గా వినిపించలేదు. తండ్రి తన మాట వినడం లేదన్న కసి తప్ప ఆ టైంలో తండ్రి గురించి ఆలోచించే స్థితిలో లేడు.

కాస్సేపటికి మళ్లీ ఫోన్ మోగింది.

ఈసారి మేనేజర్ చంద్రం.

"రాజేందర్ బాబూ! ఎక్కడున్నావయ్యా! వెంటనే ఎక్కడున్నా ప్రాణహిత ఆస్పత్రికి వచ్చేయి. నాన్నగారికి సీరియస్‌గా ఉంది" అన్న మాటలకు కొంత చలనం వచ్చింది రాజేందర్‌కి.

ఇక చేసేదేం లేక తన తండ్రికోసం అయిష్టంగానే ఆ ప్రాంతాన్ని వదిలి వచ్చేశాడు.

కారులో కూర్చున్నా అతను ఆలోచిస్తూనే ఉన్నాడు.

కొంతసేపటికి తన తండ్రిని జాయిన్ చేసిన ఆస్పత్రికి చేరుకున్నాడు.

రిసెప్షన్‌లో మేనేజర్, డ్రైవర్ అతనికోసం ఎదురు చూస్తుండడం కనిపించింది.

వారు అతన్ని అనుసరించారు.

మధ్యలో కొంతమంది డాక్టర్లు రాజేందర్‌కి ఎదురుపడి విష్ చేయడం, అతను కూడా ప్రతిగా విష్ చేయడం మామూలుగా జరిగిపోయింది.

ఏమీ మాట్లాడకుండానే తండ్రి ఉన్న ఐసియు దగ్గరికి చేరుకున్నాడు.

అతని రాకను గమనించిన ఆస్పత్రి చీఫ్ సూపరింటెండెంట్ అతని తండ్రి పరిస్థితిని వివరించేందుకు రాజేందర్‌ని తన రూమ్‌లోకి తీసుకెళ్లాడు.

"రాజేందర్‌గారూ! మీ నాన్నగారికి ఇంతకుముందే హార్ట్‌ఎటాక్ వచ్చింది. ఇప్పుడొచ్చిన స్ట్రోక్‌వల్ల పరిస్థితి కొంచెం క్రిటికల్‌గా ఉంది. అంతే కాదు ఆయన మానసికంగా ఎంతో ఉద్వేగంగా ఉన్నారు. ఆయన మీ గురించే కలవరిస్తున్నారు. మీతో ఏదో చెప్పాలనుకుంటున్నారు. మీరు కాస్సేపు ఆయనతో గడిపితే ఆయన కొంచెం రికవర్ కావచ్చు" ఉన్న పరిస్థితిని చెప్పాడు చీఫ్ సూపరింటెండెంట్.

కాస్సేపు ఆలోచించాడు రాజేందర్. "అలాగే డాక్టర్. ఇప్పుడు నేను మా డాడీని చూడొచ్చా?"

"ఓ యస్..."అంటూ అతణ్ణి ఐసియూ లోపలికి తీసుకెళ్లాడాయన.

★ ★ ★

ఐసియూలో ఉన్న రామచంద్రరావు కాస్త డల్‌గా ఉన్నట్టు కనిపిస్తున్నారు. కొడుకు రాకని గమనించిన ఆయన ముఖంలో కాసింత నిశ్చింత. ఇక తానేమైపోయినా ఫర్వాలేదు అన్నట్టుగా ఉందాయన స్థితి.

'బాబూ రాజేంద్ర! నీతో కాస్సేపు మాట్లాడాలి" అన్నారాయన అర్థింపుగా.

"అలాగే మాట్లాడండి" కొంచెం అయిష్టంగానే అన్నాడు రాజేందర్.

డాక్టర్ అక్కడినుంచి బయటికి వెళ్లిపోయారు.

"బాబూ! నీతో కొన్ని సంగతులు చెప్పాలి. అంతకన్నా ముందు నేను చెప్పేది వింటావా?" అన్నారాయన కాసింత అర్థింపుగా.

"చెప్పండి..." అన్నాడు ముక్తసరిగా.

★ ★ ★

"అనాథాశ్రమాలకు నేను చేస్తున్న సాయం నీకు ఇష్టంలేదని నాకు నీ చిన్నప్పుడే తెలిసింది. నిన్ను షాపింగ్‌కోసం అని తీసుకెళ్ళేటప్పుడు ముందుగా అనాథాశ్రమానికి వెళ్లాం గుర్తుందా? అప్పుడు నువ్వు 'వీళ్ల దగ్గరకెందుకు? నా మూడ్ పాడవుతుంది. ముందు నాకిష్టమైన బొమ్మలు, బట్టలు అవీ కొనుక్కోవడానికి వెళదాం' అన్నావు. అలా నువ్వు అంటావని అనుకోలేదు. కానీ ఆ తర్వాత తెలిసింది నీకు వాళ్లంటే అయిష్టమని. అయినా నేను ముందే ఏదైనా డిసైడ్ అయితే దాన్నుంచి బయట పడడం. నా షెడ్యూల్‌ని మార్చుకోవడం నాకు ఇష్టం ఉండదు. అందుకే నువ్వు వద్దంటున్నా అక్కడికే తీసుకెళ్లాను. వారిలో కొంతమందిని చూసైనా నువ్వు కాసేపు అయిష్టాన్ని ప్రక్కన పెడతావు అనుకున్నాను. కానీ నీలో ఎలాంటి మార్పు రాలేదు..." అన్నారాయన కాస్సేపు విశ్రాంతి తీసుకోవడానికి ఆగుతూ.

"ఆపండి... ఆ స్టోరీ ఇంతా ఇప్పుడెందుకు? "అన్నాడు రాజేందర్. కొడుకులోని అసహనానికి కాసింత బాధేసింది ఆయనకి.

అయినా ఎలాంటి ఆవేశానికి గురవ్వకుండా తాను చెప్పాలనుకున్నది ఆయన కొనసాగించారు.

"బాబూ! అలా నీకు ఇష్టం లేకపోయినా అనాథాశ్రమాలకు నేను సాయం చేయడం కొనసాగిస్తూనే ఉన్నాను. మన ఇంట్లో ఏ ఫంక్షన్ అయినా అది పూర్తయ్యాక ఆరోజు అనాథాశ్రమానికి వెళ్లి ఆ ఆనందాన్ని మళ్ళీ అనాథ పిల్లలతో పంచుకోవడం నాకు ఎంతో రిలీఫ్‌నిచ్చేది. అంతేకాదు మీ అమ్మ చనిపోయిన రోజున కూడా ఆ బాధని మరిచిపోవడానికి నాకు అదే మార్గంగా తోచేది. ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అలవాట్లు ఉంటాయి. వ్యసనాలకు బానిసై ఆనందాన్ని అనుభవించేవారు ఒకరైతే, కొంతమంది ఆధ్యాత్మికతని ఆచరించి కొండంత కష్టాన్ని మరిచిపోతుంటారు. ఆఫీసులో ఎంత బిజీగా, టెన్షన్‌లతో ఉన్నా నాకు అనాథాశ్రమాలకు, దేవాలయాలకు వెళ్ళడం ఎంతో బాగుండేది.

అందుకే నేను అలాంటి వాటికి ఎక్కువ టైం కేటాయిస్తుండేవాడిని. నిన్ను స్కూల్‌నించి తీసుకొచ్చి ఇంటి దగ్గర దింపి ఆఫీసు పనిలో బిజీగా ఉన్నా నీతో ఎక్కువ టైం గడపాలనుకునేవాడిని. తల్లి లేని లోటును తీర్చడం ఎవరివల్లా కాదు. కానీ నాకు తోచినట్టుగా నీకు ఆ ప్రేమని అందించడానికి కృషిచేసేవాడిని" అన్నారాయన.

కాసింత అలసటగా ఉండడంతో కాసేపు రిలాక్స్‌డ్‌గా పడుకున్నారు. ఓ అరగంట తర్వాత కొడుకు మళ్లీ తండ్రి దగ్గరకి వచ్చాడు.

కొడుకు ముఖంలోకి చూసిన తండ్రి అతనికి అసలు కథేమిటో చెప్పడం ప్రారంభించాడు.

'పెళ్లయిన పదేళ్ల వరకూ పిల్లలు లేకపోవడం మాకు ఎంతో లోటుగా ఉండేది. ఎంతోమంది దేవుళ్లకు మొక్కుకున్నాం. చివరికి మా మొర ఆలకించిన ఆ దేవుడి దయవల్ల పదకొండో ఏట నా భార్య కడుపు పండింది. నెలలు నిండే వరకూ నా భార్యను ప్రాణప్రదంగా చూసుకున్నాను. అయితే పురుటిలో బిడ్డ చనిపోయింది. ఏంచేయాలో నాకు అర్థం కాలేదు. బిడ్డే ప్రాణంగా ఉన్న నా భార్య ఈ నిజాన్ని ఎలా జీర్ణించుకుంటుందోనని చాలా భయపడ్డాను. నా భార్య ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ల సాయంతో సమీపంలో ఉన్న అనాథాశ్రమం నుంచి ఓ బిడ్డను తీసుకువచ్చి ఆమె పక్కన పడుకోబెట్టాను.

లేచిన వెంటనే ఆ బిడ్డను చూసుకుని ఆమె ఎంతో పొంగిపోయింది. ఆమె ఆనందాన్ని చూసి అసలు నిజం చెప్పలేక నేను కూడా ఆమె ఆనందంలో పాలుపంచుకున్నాను.

పొత్తిళ్లలో ఉన్న బిడ్డ తనకు పుట్టిన బిడ్డే అని ఆమె భ్రమపడుతోంది. డాక్టర్లకీ, అనాథాశ్రమం నిర్వాహకులకీ తప్ప ఈ నిజం ఎవ్వరికీ తెలియదు. కొన్నాళ్ళు ఈ బిడ్డ ఆలనాపాలనలో ఆనందంగా జీవించిన నా భార్య విశాలాక్షి ఓ ఏడాదికి జాండిస్‌తో నానుంచి దూరమైపోయింది. అలా ఆ బిడ్డ ఆలనాపాలనా నేను చూడడం మొదలుపెట్టాను. అప్పటికే అభివృద్ధిలోకి వచ్చిన కంపెనీనీ, బిడ్డని జాగ్రత్తగా చూసుకోవడం నా విధి అయిపోయింది. నా భార్య చనిపోయాక ఆ పిల్లాడిని జాగ్రత్తగా పెంచాలని ఆలోచించానే తప్ప మరో పెళ్లి గురించి ఆలోచించలేదు.

నా దగ్గర పనిచేసే ఉద్యోగులంతా ఆ బిడ్డని ఎంతో ప్రేమగా చూసేవారు.

కష్టం తెలియకుండా ఆ బిడ్డని పెంచసాగారు. అతన్ని అనాథగా ఎప్పుడూ చూడలేదు.

నాకు వీలున్నప్పుడల్లా నేను ఆ అనాథాశ్రమానికి వెళుతూ, అక్కడి కార్యకలాపాలకు నా వంతు సాయం చేస్తూ వస్తున్నాను.

ఆ అనాథలంటే నాకు అందుకే అంత అభిమానం. నువ్వు ఎంత వద్దన్నా ఆ సేవా కార్యక్రమాలకు మన ఆస్తిలో కొంత ఖర్చు పెడుతూనే ఉంటాను."

"ఇంతకీ ఆ అబ్బాయి ఎవరు?" ఉద్వేగంగా అడిగాడ ఆత్రుత ఆపుకోలేక రాజేందర్.

"ఇంకా ఎవరో తెలుసుకోలేకపోయావా? నువ్వే ఆ అబ్బాయివి!" అన్నారాయన కళ్లవెంబడి నీరు కారుతోంటే

నోట మాట రాక అప్రతిభుడై ఉండిపోయాడు రాజేందర్

ఏ ఆలనాపాలనా లేకుండా అనాథగా బ్రతకాల్సిన తాన ఇలా రాజభోగాలు అనుభవిస్తూ కూడా ఇన్నాళ్ళనుం తండ్రిని హింస పెట్టాడన్న మాట. తనకు చిన్నతనంలో ఆశ్రయం ఇచ్చిన అనాథాశ్రమానికి సాయం చేయకుండ అడ్డుపడడం అతన్ని బాధించింది.

"నువ్వు నా కొడుకువి కాకపోయినా నేనెప్పుడూ నిన్ను అనాథగా చూడలేదు. అందుకే నువ్వెంతగా రెచ్చగొట్టిన నేను ఆ నిజం చెప్పకుండా దాచాను. అలా దాయడాని నేనెంత మానసిక క్షోభని అనుభవించానో నాకే తెలియదు అయినా ప్రేగు త్రెంచుకు పుట్టకపోయినా తల్లి ఏ బిడ్డకైన మాతృప్రేమను అందిస్తుంది. నా భార్య బ్రతికున్నం కాలం నిన్ను ఎంతో ప్రేమగా చూసుకుంది. నేను కూడ నీకు తల్లిలేని లోటును తీర్చానని అనుకుంటున్నాను. నీ పట్ల నేనెప్పుడూ నిర్లక్ష్యంగా లేను. ఈ కోట్లాది రూపాయల ఈ ఆస్తికి నువ్వే వారసుడివి. ఎంత ఖర్చు పెట్టుకున్నా నిన్నెవరూ అడిగేవారు లేరు. నీకు సంతృప్తినిచ్చే పనుల ఏవైనా నువ్వు చేసుకోవచ్చు. అంతేకాదు ఈ ఆస్తిలో కోటి రూపాయల్ని మాత్రం నేను అనాథాశ్రమానికి రాశాను మిగిలిన ఆస్తి అంతా నువ్వే తీసుకో. దానికి సంబంధించిన పత్రాలన్నీ మన కంపెనీ లాయర్ నాగభూషణంగారి దగ్గర ఉన్నాయి" అంటూ ఆయన కొడుకు చేతిలో చేయి వేద్దామని చూశారు.

కొడుకు అక్కడ కన్పించలేదు. కాళ్లకు తడి అంటి ఏదో స్పర్శ కూడా తెలియడంతో, అప్రయత్నంగా అటువైపు దృష్టి సారించారు.

ఏం బదులు చెప్పాలో తెలీక పశ్చాత్తాపంతో కన్నీళ్లు ఉబికి రాగా, తండ్రి పాదాలు పట్టుకుని మోకాళ్లమీద కూర్చుని వున్నాడు రాజేందర్. ★

